క్లుప్తంగా

చట్టాలపై అవగాహన కల్పించండి


విక్టర్ ప్రసాదును కలిసిన డీవీఎంసీ సభ్యులు

కర్నూలు(సెంట్రల్): చట్టాలపై సామాన్య ప్రజలకు అవగాహన కల్పించాలని ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాదు తనను కలసిన డీవీఎంసీ సభ్యులకు సూచించారు. గురువారం కర్నూలు వచ్చిన ఆయనను స్టేట్ గెస్టు హౌస్‌లో డీవీఎంసీ సభ్యులు సాయిప్రసాద్, సత్తి రాజశేఖర్, రవి శాస్త్రీ, రాజు, నవీన్, రమేష్, ప్రభుదాస్ కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ బాధితులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. ప్రతి నెలా సివిల్ రైట్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. జస్టిస్ పున్నయ్య కమిషన్ ఇచ్చినటువంటి జీఓలపై అవగాహన పెంచుకోవాలన్నారు.

‘చలో ఢిల్లీ’ని జయప్రదం చేయండి

కర్నూలు(సెంట్రల్): ఏప్రిల్ 5వ తేదీన చేపట్టే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ నగర కార్యదర్శి సీహెచ్ సాయిబాబా, ఉపాధ్యక్షులు కె.సుధాకరప్ప పిలుపునిచ్చారు. గురువారం చలో ఢిల్లీ కార్యక్రమం విజయవంతం కోసం కల్లూరు ఇండస్ట్రియల్ ఏరియల్ సీఐటీయూ ఆధ్వర్యంలో బాషా హోటల్ నుంచి చెన్నమ్మ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు రవి, మధు, కె.మహేష్, అచ్చన్న, భూషణం పాల్గొన్నారు.

8న రన్ ఫర్ జీసస్


రన్ ఫర్ జీసస్ టీషర్టులు, లోగోను ఆవిష్కరిస్తున్న సీటీ పాస్టర్ల సంఘం ప్రతినిధులు

కర్నూలు (టౌన్): ఏప్రిల్ 8వ తేదీ కర్నూలులో నిర్వహిస్తున్న రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కర్నూలు సీటీ పాస్టర్స్ అసోసియేషన్ చైర్మన్ సజీవరావు, కన్వీనర్ దాసరి సుధీర్ పిలుపు నిచ్చారు. గురువారం స్థానిక కోల్స్ సెంటీనియల్ తెలుగు బాప్టిస్టు చర్చి ప్రాంగణంలో రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని పురస్కరించుకొని టీషర్టులు, టోపీలు, లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 8వ తేదీ ఉదయం 6 గంటలకు స్థానికంగా చిల్డ్రన్స్ పార్కు వద్ద ఉన్న ఆర్సీఎం చర్చి నుంచి రన్ ఫర్ జీసస్ ప్రారంభమై సి.క్యాంపు ప్రార్థన మందిరం వద్ద ముగుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కోల్స్ చర్చి అధ్యక్షులు ఎస్. ప్రభుదాస్, కార్యదర్శి అనిల్ నాథ్, సీఎస్ఐ చర్చి నుంచి వరప్రసాద రావు, సంఘ కాపారులు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

టోల్ పెంపు నిర్ణయం వెనక్కి తీసుకోవాలి

కర్నూలు(సెంట్రల్): దేశంలో ఏప్రిల్ 1 నుంచి అన్ని రకాల టోల్‌ప్లాజాల పన్నులు పెంచుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఏపీపీటీడీ(ఆర్టీసీ) స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సత్యరాజు, వీఎస్ రాముడు డిమాండ్ చేశారు. గురువారం వారు కార్మిక, కర్షక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. టోల్ ప్లాజాల ద్వారా అన్ని రకాల వాహనాల పన్నులను పెంచుతూ కేంద్రం తీసుకున్న నిర్ణయం వల్ల నష్టాల్లో ఉన్న ఆర్టీసీకి మరింత భారం పడుతుందన్నారు. టోల్ రేట్లను నిరసిస్తూ ఏఆర్‌టీడబ్ల్యూఫ్ చేపట్టిన నిరసన ఎస్‌డబ్ల్యూఫ్ మద్దతు ఇస్తుందని తెలియజేశారు.

ముగిసిన ఫ్లోర్ కర్లింగ్ పోటీలు

నెల్లూరు(టౌన్): నెల్లూరులోని వేదాయపాళెంలో ఉన్న ఎల్‌ఎల్‌ఎఫ్ స్కూల్లో రాష్ట్రస్థాయి కర్లింగ్ పోటీల ముగింపు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఫ్లోర్ కర్లింగ్ గేమ్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేంద్రరెడ్డి మాట్లాడుతూ సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను తిరుపతి, ద్వితీయ స్థానాన్ని నెల్లూరు, తృతీయ స్థానాన్ని కర్నూలు జిల్లా క్రీడాకారులు కైవసం చేసుకున్నారన్నారు. వీరు మే 19 నుంచి 21వ తేదీ వరకు అరుణాచల్‌ప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. విజేతలకు, రాణించిన క్రీడాకారులకు ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ట్రోఫీలు, మెడల్స్ ప్రదానం చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

సాక్షి సినిమాలు

ఎస్వీసీ కాంప్లెక్స్ : దసరా,భోలా, దాస్ కా ధమ్కీ,బలగం
వి మెగా ఆనంద్ సినీ కాంప్లెక్స్: దసరా సత్యం వద ధర్మం చెర, డంజియన్స్ అండ్ డ్రాగన్స్ : హానర్ అమాంగ్ థీవ్స్, దాస్ కా ధమ్కీ
వెంకటేష్ సినీ కాంప్లెక్స్: దసరా
ఐనాక్స్: భోలా,జాన్ విక్ చాప్టర్–4, డంజియన్స్ అండ్ డ్రాగన్స్ : హానర్ అమాంగ్ థీవ్స్,గురుదేవ్ హొయ్‌సల
రాజ్ : దసరా
శ్రీరామ : దసరా
విజయ: దసరా





చిన్మయ మిషన్‌లో సీతారామలక్ష్మణులు, అశోక్‌నగర్ శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయంలో అన్నదానం, హరిహరక్షేత్రంలో పట్టువస్త్రాలు, తలంబ్రాలు తెస్తున్న ఆలయ కమిటీ సభ్యులు, గణేష్‌నగర్ జర్నలిస్ట్ కాలనీలో జరిగిన కల్యాణోత్సవంలో పాల్గొన్న మేయర్ బీవై రామయ్య

జగదభిరామా.. సీతారామా

- కమనీయంగా సీతారాముల కల్యాణ వేడుకలు
- శ్రీరామనామ సంకీర్తనలతో ఆలయాల్లో సంతరించుకున్న ఆధ్యాత్మిక శోభ
- వేడుకల్లో ఎమ్మెల్యే కాటసాని, మేయర్ రామయ్య


అశోక్‌నగర్ శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయంలో రాములోరి కల్యాణ వేడుక

కర్నూలు కల్చరల్: కర్నూలు నగరంలో శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా జరిగాయి. గురువారం నగరంలోని సీతారామ, ఆంజనేయ స్వామి ఆలయాల్లో సీతా రాముల కల్యాణోత్సవాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల సవ్వళ్లు, భక్తుల శ్రీరామ నామ జపం, కోలాటాలు, భజనలతో కూడిన వేడుకలు ఆలయాల్లో ఆధ్యాత్మిక శోభను తెచ్చిపెట్టాయి. పండితులు శ్రీరామ పర్వదినం విశిష్టతను వివరించారు. స్వామివారికి అభిషేకాలు, పల్లకి సేవ, రథోత్సవం, ఉత్సవ మూర్తుల ఊరేగింపు, చందనోత్సవం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీరామనవమి శోభా యాత్ర నిర్వహించారు. వడపప్పు, పానకం ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు. అన్నదానం చేశారు. భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. వేడుకల్లో ప్రజా ప్రతినిధులు, కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

- రామలింగేశ్వర్‌నగర్‌లోని పార్క్‌లో శ్రీరామ నవమి వేడుకలు, సీతారాముల కల్యాణోత్సవం ఘనంగా జరిగింది. వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.
- శ్రీ సీతారామ కల్యాణ మహోత్సవ కమిటీ ఆధ్వర్యంలో వీఆర్ కాలనీలోని వెంకటేశ్వర స్వామి ఆలయం కల్యాణ మండపంలో శ్రీరామ నవమిని వేడుకలు జరిగాయి. వేలాది మంది భక్తులు వేడుకల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.
- వీఆర్ కాలనీ చిన్మయ మిషన్ కేంద్రంలో జరిగిన వేడుకల్లో మిషన్ బాధ్యులు స్వామిని సుప్రేమానంద సందేశమిచ్చారు. చిన్మయ మిషన్ అధ్యక్షులు విజయకుమార్‌రెడ్డి, కోశాధికారి రత్న ప్రసాద్, సభ్యులు పాల్గొన్నారు.
- అశోక్‌నగర్ శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామి ద్వారకామాయి సాయిబాబ దేవస్థానంలో జరిగిన వేడుకల్లో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ శమంతకమణి, ఆలయ కమిటీ కార్యదర్శి లక్ష్మణ గౌడ్, కోశాధికారి రవింద్రనాథ్, సభ్యులు సాయిబాబ, రామ్మోహన్, జయమ్మ, ఇందిరమ్మ పాల్గొన్నారు.
- స్థానిక సూర్యనారాయణ స్వామి ఆలయంలో జరిగిన వేడుకల్లో ఆలయం మేనేజింగ్ ట్రస్టీ శివ రామకృష్ణ, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.
- ఓల్డ్‌సిటీలోని లలితా పీఠంలో జరిగిన వేడుకల్లో పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్య స్వామి సందేశమిచ్చారు.
- ఓల్డ్‌సిటీలోని చెన్నకేశవ స్వామి ఆలయంలో జరిగిన వేడుకల్లో ఎస్వీ ఫౌండేషన్ వైస్ చైర్మన్ ఎస్వీ విజయమనోహరి, ఆలయ కమిటీ సభ్యులు లక్ష్మి, శ్రీనివాసులు, లక్ష్మినారాయణ, రాముడు తదితరులు పాల్గొన్నారు. కల్లూరు అర్బన్ 32వ వార్డులోని శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో జరిగిన వేడుకల్లో పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి దంపతులు, కర్నూలు గణేష్ నగర్‌లోని జర్నలిస్ట్ కాలనీలోని సీతారామాలయంలో జరిగిన వేడుకల్లో కర్నూలు నగర మేయర్ బీవై రామయ్యలు పాల్గొన్నారు.


గణేష్‌నగర్‌లోని శ్రీఅభయ ఆంజనేయ స్వామి, సోమనాథేశ్వర స్వామి ఆలయం, శరీన్ నగర్ సద్గురు త్యాగరాజ సీతారామాలయం, శ్రీనివాస నగర్‌లోని సత్యసాయి మందిరం, కర్నూలు నగర బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో సంకల్‌బాగ్‌లోని హరి హర క్షేత్రం, బుధవారపేట ఈశ్వర ఆంజనేయ స్వామి ఆలయం, బళ్లారి చౌరస్తాలోని అభయాంజనేయస్వామి ఆలయం, కొత్తపేట, శ్రీరామనగర్‌లోని సీతారామాంజనేయ స్వామి ఆలయాలు, ఓల్డ్‌సిటీలోని రాంబొట్ల దేవాలయం, తెలుగు గేరిలోని చిన్న ఆంజనేయ స్వామి దేవాలయం, రెవెన్యూ కాలనీలోని భరతమాత ఆలయం, ఇస్కాన్ జగన్నాథ మందిరం, వడ్డేగేరిలోని కోదండరామాలయం, గోశాల, పేట ఆంజనేయస్వామి ఆలయం, కొత్తపేట కోదండరామాలయం, శరీన్ నగర్‌లోని సద్గురు త్యాగరాజ సీతారామాలయం, మారుతి నగర్‌లోని మారుతి రామేశ్వర ఆలయం, ఓల్డ్ సిటీలోని దండేగేరి సీతారామాలయం సాయిబాబా భక్త మండలి ఆధ్వర్యంలో దక్షిణ షిరిడీ సాయిబాబ దేవస్థానంలో వేడుకలు వైభవంగా జరిగాయి. ఆలయాల ఈవోలు, ఆయా ఆలయాల కమిటీలు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకార్యాలు ఏర్పాటు చేశారు.


సంకల్‌బాగ్ హరిహరక్షేత్రంలో వేడుకల్లో పాల్గొన్న భక్తులు


పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయంలో పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే కాటసాని


గణేష్‌నగర్‌లోని అభయాంజనేయ స్వామి ఆలయంలో...

కల్లూరు: శ్రీరామ నవమి వేడుకలు కల్లూరు అర్బన్, గ్రామీణ ప్రాంతాల్లో కనుల పండువగా జరిగాయి. కర్నూలు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, నగర్ మేయర్ బీవై రామయ్య నగరంలోని 19వ వార్డులోని మారుతి నగర్, గణేష్ నగర్‌లలోని మారుతి రామేశ్వరాలయం, వెంకటేశ్వర్వస్వామి ఆలయంలో, 21వ వార్డు డాక్టర్స్ కాలనీలోని సీతారాముల ఆలయంలో జరిగిన సీతారాముల వారి కల్యాణ మహోత్సవాలకు హాజరై ప్రత్యేక పూజాలు చేశారు. వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి 32వ వార్డులోని శ్రీ పంచముఖ ఆంజనేయ దేవాలయంలో జరిగన కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యేతో పాటు స్థానిక కార్పొరేటర్ సాన శ్రీనివాసులు వేడుకల్లో పాల్గొన్నారు.



ఇస్కాన్‌లో ప్రత్యేక అలంకారంలో.., లలితా పీఠంలో కల్యాణ మూర్తులుగా సీతారాములు,తెలుగు వీధిలో శ్రీరామనవమి శోభాయాత్ర, లలితా పీఠంలో స్వామివారికి హారతులు ఇస్తున్న భక్తులు, చెన్నకేశవ స్వామి ఆలయంలో పాల్గొన్న భక్తులు

ఇఫ్తార్ విందులో కర్నూలు ఎమ్మెల్యే



కర్నూలు(రాజ్‌విహార్): రంజాన్ మాసం సందర్భంగా నగరంలోని 48వ వార్డులోని గఫూరియా మసీదులో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ పాల్గొన్నారు. గురువారం రాత్రి మసీద్ పెద్దలతో కలసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఖలీద్, జిలాన్, ఖాదర్, మౌలానా, మన్సూర్, షాకీర్, సీహెచ్ మద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

భాష్యం స్కూల్ వార్షికోత్సవం

కర్నూలు(సిటీ): నగరంలోని కృష్ణానగర్‌లో ఉన్న భాష్యం ఇంగ్లిష్ మీడియం స్కూల్ రెండో వార్షికోత్సవాన్ని బుధవారం బిర్లా కాంపౌండ్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాష్యం విద్యాసంస్థల రాయలసీమ జోనల్ ఇన్‌చార్జ్‌లు అనిల్‌కుమార్, డాక్టర్ వినోద్‌కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. వేసవిలో విద్యార్థులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

అలవోకగా బరువులెత్తేస్తున్నారు!

- వెయిట్ లిఫ్టింగ్‌లో రాణిస్తున్న అతివలు
- వివిధ పోటీల్లో ఏటా 30 మందికి పైగా పతకాలు


స్టేడియంలో శిక్షణ ఇస్తున్న దృశ్యం

కర్నూలు (టౌన్): ఒకప్పుడు ఆడపిల్లలు తొక్కుడు బిళ్ల, తాడాట, ఖోఖో వంటి ఆటలకే పరిమితమయ్యేవారు. ఇప్పుడు ట్రెండ్ మారింది. తాము ఏరంగంలోనూ తక్కువ కాదు అంటూ పురుషులకు దీటుగా క్రీడల్లోనూ రాణిస్తున్నారు. వెయిట్ లిఫ్టింగ్‌లో సత్తా చాటుతూ పతకాలు సాధిస్తున్నారు. మిగిలిన క్రీడలతో పోలిస్తే వెయిట్ లిఫ్టింగ్‌లో మానసికంగా, శారీరకంగా చాలా శక్తివంతంగా ఉండాల్సిన అవసరం ఉంది. అయితే అవరోధాలన్నింటినీ అధిగమిస్తూ నిర్దేశించుకున్న లక్ష్యాన్ని చేరుకుంటున్నారు. అలవోకగా బరువులు ఎత్తుతూ ఔరా అనిపిస్తున్నారు.

స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో శిక్షణ

కర్నూలు నగరంలోని స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో వెయిట్ లిఫ్టింగ్ క్రీడలో గత 25 సంవత్సరాలుగా శిక్షణ ఇస్తున్నారు. స్టేడియంలో ఉదయం, సాయంత్రం రెండుపూటల ఉచితంగా శిక్షణ ఇస్తారు. జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టర్లు ఇక్కడ కోచ్‌గా వ్యవహరిస్తున్నారు. ఇక్కడ తీసుకున్న శిక్షణతో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో మహిళలు రాణిస్తున్నారు. ప్రతి సంవత్సరం కర్నూలు నుంచి 100 మంది వెయిట్ లిఫ్టర్లు వివిధ పోటీల్లో పాల్గొంటున్నారు. ఇందులో ఏటా 30 మందికి తక్కువ కాకుండా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్, సీఎం కప్ పోటీల్లో పతకాలు సాధిస్తున్నారు. గత రెండేళ్లలో కర్నూలు ఉమెన్ వెయిట్‌లిఫ్టర్లు 32 మంది రాష్ట్రస్థాయిలో పతకాలు తెచ్చుకోవడం విశేషం. ప్రభుత్వం సైతం క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వడం, స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగావకాశాలు కల్పించడంతో అతివలు ఒక వైపు చదువుకుంటూనే మరోవైపు బరువులు ఎత్తడంలో సై అంటున్నారు.

ప్రతిభ చాటుతున్న నాగమణి



ఏ.నాగమణి స్థానిక ఎస్‌టీబీసీ కళాశాలలో డిగ్రీ చదువుతోంది. ఇప్పటికే జిల్లా, రాష్ట్ర స్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ చాటింది. గత ఏడాది నవంబర్ 26 నుంచి 28వ తేదీ వరకు ఆచార్య నాగర్జున యూనివర్సిటీలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో పాల్గొన్న ఈమె 85 కిలోల కేటగిరిలో కాంస్య పతకం సాధించింది.

‘వెండి’తో మెరిసిన వి.భవాని



వెయిట్ లిఫ్టర్ వి.భవానీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతోంది. రాష్ట్ర స్థాయిలో ఈఏడాది జనవరి నెలలో జగ్గయ్య పేటలో జరిగిన స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో ఈమె పాల్గొనింది. అండర్–17 విభాగం 81కిలోల క్యాటగిరీలో సులభంగా బరువెత్తి వెండి పతకం కైవసం చేసుకుంది.

వెయిట్ లిఫ్టర్ బి.తరుణికి కాంస్యం



వెయిట్ లిఫ్టర్ బి.తరుణి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతోంది. వెయిల్‌లిఫ్టింగ్ క్రీడలో జిల్లా స్థాయిలో గుర్తింపు తెచ్చుకుంది. ఈ ఏడాది జనవరి నెలలో జగ్గయ్య పేటలో జరిగిన రాష్ట్ర స్థాయి స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో అండర్–19 విభాగం 71 కేజీల క్యాటగిరిలో సత్తాచాటి కాంస్య పతకం తెచ్చుకుంది.

తల్లిదండ్రులు పిల్లలను ప్రోత్సహిస్తున్నారు



కర్నూలు స్టేడియంలోని వెయిట్ లిఫ్టింగ్ హాలులో వెయిట్ లిఫ్టర్లకు 25 సంవత్సరాలుగా శిక్షణ ఇస్తున్నారు. నేను 13 సంవత్సరాలుగా కోచ్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నా. 2005 సంవత్సరంలోనే నేను వెయిట్‌లిఫ్టింగ్‌లో బంగారు పతకం సాధించా. వెయిట్ లిఫ్టింగ్ క్రీడలో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రోత్సహిస్తున్నారు. ప్రతి సంవత్సరం 100 మంది స్టేడియంలో శిక్షణ తీసుకుంటున్నారు. ఇందులో 30 మందికి తక్కువ కాకుండా వివిధ పోటీల్లో పతకాలు సాధిస్తున్నారు. కర్నూలులో పదుల సంఖ్యలో ఉన్న జిమ్ సెంటర్లలో ఇక్కడ శిక్షణ తీసుకున్న వారే ఉన్నారు. ఉపాధికి ఢోకా ఉండదు.

–షేక్ యూసుఫ్ బాషా, స్టేడియం వెయిట్ లిఫ్టింగ్ కోచ్

బాలుడి కిడ్నాప్ కలకలం


కిడ్నాప్‌కు గురైన బాలుడిని తల్లికి అప్పగించి నిందితులను అరెస్టు చూపుతున్న పోలీసులు

- ఆలస్యంగా వెలుగులోకి
- మొదట మిస్సింగ్ కేసు నమోదు
- వారంలోగా ఛేదించి తల్లికి అప్పగించిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన కర్నూలు డీఎస్పీ

కర్నూలు: కల్లూరు మండలం శరీన్‌నగర్‌కు చెందిన కోతి లలిత కుమారుడు ప్రవీణ్ (7) కిడ్నాప్ సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. మొదట మిస్సింగ్ కింద కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేపట్టగా కిడ్నాప్ చేసినట్లు తేలింది. బాలుడు ప్రవీణ్‌తో పాటు ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన మునీశ్వరి, నాగార్జున దంపతులను అదుపులోకి తీసుకుని కర్నూలు డీఎస్పీ కె.వి.మహేష్ ఎదుట హాజరుపరిచారు. గురువారం సాయంత్రం నాల్గవ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సీఐ శంకరయ్యతో కలసి డీఎస్పీ కె.వి.మహేష్ విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలను వెల్లడించారు. శరీన్‌నగర్‌కు చెందిన కోతి లలిత భర్త శివకుమార్ చనిపోయాడు. ఆమెకు ప్రశాంత్‌కుమార్, ప్రవీణ్ సంతానం. అదే కాలనీలో నివాసముంటున్న తిరుపాలు భార్య లక్ష్మీ నారాయణమ్మతో కలసి ఈనెల 24వ తేదీన కల్లూరులో జరుగుతున్న చౌడేశ్వరి దేవి జాతరకు ఇద్దరు కుమారులను తీసుకుని వెళ్లింది. తనకు దాహం వేస్తోంది.. నీళ్లు కావాలని నారాయణమ్మ కోరగా లలిత తన చిన్నకుమారుడు ప్రవీణ్‌ను లక్ష్మీనారాయణమ్మ వద్ద వదిలి పెద్ద కుమారుడుతో కలసి నీళ్ల తేవడానికి కొంత దూరం వెళ్లింది. తిరిగి వచ్చేసరికి తన కుమారుడు కనిపించకపోవడంతో నారాయణమ్మను నిలదీయగా మీరు వెళ్లిన వెంటనే వెనకనే బాలుడు కూడా వచ్చాడంటూ బుకాయించింది. దీంతో ఆమెపై అనుమానం వచ్చి లలిత నాల్గవ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో అదేరోజు ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కింద కేసు నమోదు చేస్తుకున్నారు. దర్యాప్తులో భాగంగా తప్పిపోయిన ప్రవీణ్ గురించి వెతుకుతూ కృష్ణానగర్ ఐటీసీ ఫ్యాక్టరీ వద్ద లక్ష్మీనారాయణమ్మను అనుమానంపై అదుపులోకి తీసుకుని విచారించగా ప్రవీణ్‌ను తానే కిడ్నాప్ చేసినట్లు అంగీకరించింది.

చెల్లికి పిల్లలు లేని కారణంగా...

లక్ష్మీనారాయణమ్మ చెల్లెలు మునీశ్వరి ఎమ్మిగనూరులో ఉంటుంది. ఆమెకు సంతానం లేకపోవడంతో లలిత కుమారుడు ప్రవీణ్‌ను ముందుగానే వేసుకున్న పథకం ప్రకారం కిడ్నాప్ చేసి మునీశ్వరికి అప్పగించి ఎమ్మిగనూరుకు పంపినట్లు అంగీకరించింది. దీంతో మునీశ్వరి, ఆమె భర్త నాగార్జునను అరెస్టు చేసి వారి చెంత ఉన్న బాలుడు ప్రవీణ్‌ను ఎమ్మిగనూరులో అదుపులోకి తీసుకుని మిస్సింగ్ కేసును కిడ్నాప్ కేసుగా మార్పు చేసినట్లు డీఎస్పీ వెల్లడించారు. లలితను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి బాలుడిని అప్పగించి ముద్దాయిలు లక్ష్మీనారాయణమ్మ, ఆమె చెల్లెలు మునీశ్వరి, భర్త నాగార్జునలపై కిడ్నాప్ కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించినట్లు డీఎస్పీ వెల్లడించారు.

సుంకేసులకు ఇన్‌ఫ్లో

గూడూరు: మండల పరిధిలోని సుంకేసుల జలాశయానికి గురువారం ఎగువ నుంచి 1,050 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. డ్యాంలో 1.026 టీఎంసీల నీరు నిల్వ ఉండగా కేసీ కాల్వకు 602 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.